నత్తనడకన సత్యవేడు అభివృద్ధి

- రాజకీయ అనిశ్చితలో సత్యవేడు
- నాడు విమర్శలు చేసి.. నేడు చేస్తున్నదేమిటో?
- సత్యవేడులో చంద్రబాబు సామాజిక వర్గం వారే పెత్తందారులు
- దళిత నియోజకవర్గంలో దళితులకు కరువైన భద్రత
- వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శ



సాక్షి ఇంటర్వ్యూ

వరదయ్యపాళెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సత్యవేడు నియోజకవర్గంలో అభివృద్ధి నత్తనడకన సాగుతోంది. ఈ విషయంపై రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు పూర్తి అయిన నేపథ్యంలో నూకతోటి రాజేష్ సాక్షితో మాట్లాడారు.

ప్రధాన రోడ్ల అభివృద్ధి ఊసే లేదు

ప్రత్యేకంగా రోడ్ల సమస్య గురించి రాజేష్ ప్రస్తావించారు. చిన్న పాండూరు నుంచి నాగలాపురం వరకు, ఊత్తుకోట నుంచి సత్యవేడు వరకు ఉన్న ప్రధాన ఆర్ అండ్‌బీ రహదారుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఈ మార్గాల్లో ప్రయాణం నరక యాతన గా మారిందన్నారు. గత ప్రభుత్వంలో దాసుకుప్పం బైపాస్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి, భూసేకరణ పనులు సైతం ప్రారంభించినప్పటికీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ రోడ్డు ఊసే లేదన్నారు.

కక్ష సాధింపు చర్యలు

ప్రధానంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ ఉద్యోగులను రాజకీయ కారణాలతో తొలగిస్తూ టీడీపీకి అనుకూలంగా ఉన్న వారిని ఉద్యోగాల్లో నియమిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

దళితులకు కరువైన భద్రత

పేరుకు సత్యవేడు ఎస్సీ రిజర్వేషన్ చేసిన నియోజకవర్గం అయినప్పటికీ ఇక్కడ ఎస్సీలకే భద్రత కరువైంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత దళితులపై జరుగుతున్న దాడులు, వారి భూముల ఆక్రమణలు తీవ్రంగా పెరిగాయన్నారు. గత ఏడాది జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో స్థానికంగా నెలకొన్న చిన్నపాటి సమస్యలకే కేవీబీపురం, వరదయ్యపాళెం మండలాల్లో 40 మందికి పైగా దళిత యువకులపై కేసులు నమోదు చేయడమే దళితులకు భద్రత కరువైందనడానికి నిదర్శనమన్నారు.

పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటా

కూటమి ప్రభుత్వ ఆగడాలను ఎప్పటికప్పుడు నిలువరించేందుకు నియోజకవర్గ ప్రజలు అందుబాటులో ఉంటానని నూకతోటి రాజేష్ చెప్పారు. అలాగే పార్టీ శ్రేణులకు ఏ సమస్య వచ్చినా వారికి అండగా నిలుస్తానన్నారు. పార్టీ సోషల్ మీడియా ద్వారా కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా వినిపిస్తామన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. తప్పుడు కేసులు పెట్టినా వారికి ఉచితంగా పార్టీకి చెందిన న్యాయవాదుల ద్వారా సేవలు అందిస్తామన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. భవిష్యత్తు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనని చెప్పారు. ఇది ప్రతి కార్యకర్త గుర్తించాలన్నారు.

తరలిపోతున్న సత్యవేడు సంపద

నియోజకవర్గం నుంచి సమీపంలోని తమిళనాడుకు రోజుకు 200 టిప్పర్లకు పైగా గ్రావెల్, ఇసుకను తరలించి పెద్దఎత్తున నియోజకవర్గంలో పెత్తందారులుగా వ్యవహరిస్తున్న చంద్రబాబు సామాజికవర్గం వారు దోపిడీ చేస్తున్నారు. ఇందుకు పోలీస్ అధికారులు సైతం వంత పాడుతూ వారి అక్రమాలకు మద్దతు పలుకుతుండడం గమనార్హం.

ఎన్నికల హామీలు గాలికి..

సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్యవేడు టవర్‌క్లాక్ వద్ద జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన హామీలు నేటికీ ఆచరణకు నోచుకోలేదన్నారు. అందులో ప్రధానంగా సత్యవేడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆస్పత్రిగా, సత్యవేడు మేజర్ పంచాయతీని మున్సిపాలిటీ, సత్యవేడుకు ప్రత్యేక బైపాస్‌తోపాటు డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇలా అనేక హామీలిచ్చినప్పటికీ నేటికీ ఒక్క హామీ కూడా కార్యరూపం దాల్చలేదని రాజేష్ అన్నారు.

అభివృద్ధి ఊసెత్తని లోకేష్

మంత్రిగా నారా లోకేష్ తొలిసారి సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించినప్పటికీ అభివృద్ధి గురించి నోరెత్తకపోవడం, కార్యకర్తలతో సెల్ఫీలు దిగి పర్యటన ముగించడం అవమానకరమన్నారు. కేవలం సత్యవేడు సంపద సరిహద్దులు దాటించేందుకు తన సామాజిక వర్గానికి చెందిన నేతలకు లైన్ క్లియర్ చేసేందుకే హడావుడిగా నియోజకవర్గంలో రెండు రోజులు మంత్రి మక్కాం వేశారని తెలిపారు.

క్లుప్తంగా

వడదెబ్బపై అవగాహన

రేణిగుంట(శ్రీకాళహస్తిరూరల్): రేణిగుంట జెడ్పీ బాలికల హైస్కూలులో వైద్యాధికారులు గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రజలకు వడదెబ్బపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్ వడదెబ్బ రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జేవీవీ కార్యదర్శి రెడ్డెప్ప, సభ్యులు రమణయ్య, కుప్పుస్వామి, రఫీ, ఇమామ్ పాల్గొన్నారు.

పెన్నులు, పుస్తకాల అందజేత



పెన్నులు, పుస్తకాలతో షేక్ అస్లాం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ అస్లాం పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఖాదర్‌బాషా, శివశంకర్, మహబూబ్‌బాషా, సయ్యద్ ఆరిఫ్, సయ్యద్ ఆసిఫ్, ఫిరోజ్, రాజేంద్ర, నరేంద్ర, వినోద్, శివ, సుభాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ నిల్.. గ్రావెల్ మాఫియా ఫుల్

సత్యవేడు: వరదయ్యపాళెం, సత్యవేడు మండలాలో గ్రావెల్ మాఫియా బరి తెగిస్తోందని, రాష్ట్రంలో సూపర్ సిక్స్ నిల్.. గ్రావెల్ మాఫియా ఫుల్‌గా ఉందని సీపీఎం మండల కార్యదర్శి ఎం. రమేష్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక సత్యవేడు, ఇతర మండలాల్లో గ్రామాల ప్రశాంతతకు భంగం కలిగించేలా గ్రావెల్ మాఫియా తమిళనాడుకు మట్టి తరలిస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ వచ్చిపోయిన తరువాత టిప్పర్ల సంఖ్య పెరిగిందన్నారు. మండల కేంద్రంలో లారీలు అతివేగంగా వెళుతుండడంతో బాటసారులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఇటు గ్రావెల్, అటు కంకరు లారీలు, మట్టి టిప్పర్లు వందల సంఖ్యలో వచ్చిపోతుండడంతో గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డులో నిరంతరం ట్రాఫిక్ సమస్య నెలకొంటోందన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పరిశీలన



ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న 16వ ఆర్థిక కమిషన్ సభ్యులు

తిరుపతితుడా/రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం తూకివాకం సమీపంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను గురువారం 16వ ఆర్థిక కమిషన్ బృందం సభ్యులు సౌమ్య కంటి ఘోష్, సెక్రటరీ గౌతమ్ అల్లాడ, పరిశీలించారు. వారికి ప్లాంట్‌లో ఘన, తడి చెత్త, కంపోస్టు ఎరువుల తయారీ, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ యూనిట్ల గురించి తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య వివరించారు. తిరుపతి నగరంలో సేకరించిన తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు, తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్, హోటళ్ల నుంచి వెలువడే వ్యర్థాల ద్వారా వంట గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. తిరుపతిలో ప్రతిరోజూ 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను ఆరు రకాలుగా గుల్ల, ఇసుకగా మార్చి పలు ఉత్పత్తులు తయారు చేస్తున్నామని తెలిపారు. ట్రీటెడ్ వేస్ట్ నీటిని పరిశ్రమలకు విక్రయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యామ్‌సుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తి ఊరేగింపు



గురుదక్షిణామూర్తికి హారతిస్తున్న అర్చకుడు

శ్రీకాళహస్తి: గురుదక్షిణామూర్తి ఉత్సవమూర్తిని గురువారం ఘనంగా ఊరేగించారు. ఆలయ అలంకార మండపంలో పలురకాల పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ దక్షిణామూర్తి ఊరేగింపు జరిగింది. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మళ్లీ వెరిఫికేషన్ టెన్షన్

వరదయ్యపాళెం: మండలంలోని దివ్యాంగ పింఛన్‌దారులకు మళ్లీ వెరిఫికేషన్ టెన్షన్ మొదలైంది. మానసిక వికలాంగ పింఛన్‌దారులకు సంబంధించి మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 74 మంది పింఛన్‌దారులకు నోటీసులు అందజేశారు. వారికి నోటీసుల్లో కేటాయించిన తేదీల వారీగా మెడికల్ వెరిఫికేషన్‌కి వెళ్లాలని సూచించారు. తిరుపతి రుయా, శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఈ వెరిఫికేషన్ జరగనున్నట్లు సచివాలయ సిబ్బంది సూచించారు.

ముక్కంటి సేవలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు

శ్రీకాళహస్తి: మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి గురువారం తన జన్మదినం సందర్భంగా తన సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డితో కలిసి శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు, పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మున్నా రాయల్, ఆవుల శ్రీనివాసులు, పగడాల రాజు, శ్రీవారి సురేష్, ఉత్తరాది శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, ఆర్కాడు ముత్తు, శివయాదవ్, పులి రామచంద్రయ్య, వేలూరు రమేష్, కంచి గురవయ్య, ఆర్కాడ్ కార్తీక్, మణి, మునికుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వరుడి సేవలో ఉడిపి పీఠాధిపతి



నాగలాపురం: మండలంలో సురుటుపల్లిలోని పళ్లికొండేశ్వరస్వామిని ఉడిపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ ఈషాప్రియ తీర్థ స్వామీజీ, తన శిష్య బృందంతో దర్శించుకున్నారు. వారికి ఆలయాధికారుల స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారికి ఆలయ ప్రదోష మండపంలో స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పక్షిరాజుపై పరంధాముడు



మోహినీ అవతారంలో కల్యాణ వేంకటేశ్వరుడు



గరుడవాహనంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పక్షి రాజైన గరుత్మంతుడిని వాహనంగా చేసుకుని స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మోహినీ అవతారంలో పల్లకిలో భక్తుల హారతులందుకున్నారు. వేకువ జామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజ, హోమశాలలో ప్రత్యేక పూజలు, తొలి గంట, దూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి వారిని మోహినీ అవతారంలో పల్లకిలో కొలువు దీర్చారు. భక్తులు స్వామివారిని తిలకించి కర్పూర హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారికి స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు స్వామివారు గరుడ వాహనాన్ని అధిరోహించిన గ్రామ వీధుల్లో ఊరేగారు. రాత్రి 11 గంటలకు ఆస్థానం, శుద్ధి తదితర కార్యక్రమాలను పూర్తి చేసి, స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ హరి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ హరికృష్ణ పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారికి హనుమంత వాహన సేవ, సాయంత్రం వసంతోత్సవం, రాత్రి గజవాహన సేవలు జరగనున్నాయి.

వైభవంగా బియ్యపు మధు జన్మదిన వేడుకలు



మాజీ ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలుపుతున్న పట్టణ నాయకులు, ప్రముఖులు



బియ్యపు మధుకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం



మాజీ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం, విద్యాసామగ్రిని అందిస్తున్న రేణిగుంట మండల నేతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, శ్రీకాళహస్తి నియోజకవర్గ పట్టణ ప్రముఖులు, ప్రజలు, కార్యకర్తలు, నాయకులు ఆయన్ని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీర్వదించడానికి విచ్చేసిన వారందరికీ భోజన ఏర్పాట్లు చేసి, అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. మాజీ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకష్టయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, వయ్యాల కష్టారెడ్డి, హేమభూషణ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గున్నేరి కిషోర్ రెడ్డి, పార్టీ ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, తొట్టంబేడు మండల అధ్యక్షుడు ఉన్నం వాసుదేవ నాయుడు, తొట్టంబేడు, రేణిగుంట ఎంపీపీలు నిర్మలమ్మ, హరి ప్రసాదరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యరాణి, కోవి చంద్రయ్యనాయుడు, సిద్దగుంట సుధాకర్ రెడ్డి, తిరుమల రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షుడు గంగారి రమేష్, ప్రభాకర్, నగేష్, రసూల్ తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు విద్యా సామగ్రి బహూకరణ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల అధ్యక్షుడు గంగారి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ తరపున రూ.50 వేల విలువచేసే విద్యా సామగ్రిని మాజీ ఎమ్మెల్యేకు బహూకరించారు. ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యరాణి, డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్దగుంట సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు తిరుమలరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, విమానాశ్రయ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీధర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు జువ్వల దయాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు భారీ స్థాయిలో ఆయన ఇంటి వద్దకు చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వెంకటయ్యకు నివాళి



వెంకటయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుడ్లవెంకటయ్య (65) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు కొణతనేని మణినాయుడు, నాయకులు పుత్తేరికి చేరుకుని ఈయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మణినాయుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండదండలు ఉంటాయని తెలిపారు. లోకయ్య కుమారుడు మండల వైఎస్సార్‌సీపీ నేత చంద్రశేఖర్‌తోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, స్టేట్ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి సాయినాయుడు, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి గురునాథం, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, నాయకులు గురవయ్య, ప్రసాద్‌పాల్, ప్రసాద్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దగ్గోలు స్రవంతి

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలంలోని పెన్నగడ్డం ఎస్టీ కాలనీలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెంబేటి మునిరత్నంరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ దగ్గోలు స్రవంతి చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. శ్రీధర్, యుగంధర్, హరిదాస్, మణి పాల్గొన్నారు. ఏర్పేడు మండలంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్ సీపీ నేత గున్నేరి కిషోర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కూనా టి రమణయ్య యాదవ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. జయముని, చెంగల్రాజు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరాలయాభివృద్ధి ఎప్పటికో?



పెద్దకన్నలి గ్రామంలో వెలసిన అగస్త్యేశ్వరాలయం

తొట్టంబేడు: మండలంలోని పెద్దకన్నలిలో ఉన్న అగస్త్యేశ్వరాలయాభివృద్ధి ఎప్పటికి జరుగుతుందోనని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆలయం 700 ఏళ్ల నాటి ఆలయం అన్న చారిత్రక ఆధారాలున్నాయి. చోళరాజులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు స్థల పురాణం చెబుతోంది. అగస్త్యముని శివునిపై అలిగి వెళుతుండగా పెద్దకన్నలి వద్ద కంటిచూపు పోయింది. తన తప్పు తెలుసుకుని శివలింగాన్ని ప్రతిష్ఠించి, పూజలు చేశారు. ఆయన భక్తికి మెచ్చి కంటిచూపు ప్రసాదించాడు. అందుకే ఈ గ్రామాన్ని కన్నుల గ్రామంగా పిలిచేవారు. కాలక్రమంలో అది కన్నలిగా రూపాంతరం చెందింది. గ్రామం పెద్దది కావడంతో పెద్దకన్నలిగా ఈ ఆలయానికి పేరు వచ్చింది. ఈ ఆలయంలో దక్షిణ దిక్కున దక్షిణామూర్తి, పడమర బ్రహ్మ, ఉత్తరం దుర్గాదేవి, విష్ణు విగ్రహాలు కొలువుదీరి ఉన్నాయి. మహాశివరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. గత మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో ఇక్కడికి వచ్చిన శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓ బాపిరెడ్డి, పాలకులు అగస్త్యేశ్వరాలయానికి మహర్దశ తీసుకువస్తామని, కల్యాణమండపం నిర్మిస్తామని అనేక హామీలు ఇచ్చారు. అయితే ఆలయాధికారులు ఆ తరువాత ఆలయం వైపు చూడకపోవడం సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు నివారించండి

శ్రీకాళహస్తి: మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకసమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల రైతులకు వ్యవసాయానికి అందించాల్సిన 7 గంటల విద్యుత్ సరఫరాలో అప్రకటిత విద్యుత్ కోతలు తరచు సంభవిస్తున్నాయన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని చెప్పారు. అప్రకటిత కోతల కారణంగా పంటలు ఎండిపోయి రైతులకు తీరని నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అప్రకటిత విద్యుత్ కోతల సమస్యను సత్వరమే నివారించి, రైతులకు నిరంతరాయంగా ఏడు గంటల విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు నవీన్, నాగరాజు, మహేష్, సారది, జోసఫ్, చరణ్, తరుణ్, షాస్ మైఖేల్, మాస్, రవి పాల్గొన్నారు.

రాయిని ఢీకొన్న కారు

నాగలాపురం: మండలంలోని చిన్నాపట్టు వద్ద పుత్తూరు–చెన్నై హైవే పక్కన రాయిని కారు ఢీకొన్న ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడులోని కొలత్తూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు కారులో తిరుపతి గంగమ్మ జాతరకు వెళ్లి, తిరిగి చెన్నైకి వెళుతుండగా మార్గం మధ్యలో చిన్నాపట్టు వద్ద హైవే పక్కన ఉన్న రాయిని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఎవరికి ప్రమాదం జరగలేదు. కారు ముందు భాగం దెబ్బతింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి



సమస్యలు ఏకరువు పెడుతున్న సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. గురువారం ఎంపీపీ మేకలసుబ్బలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల మీట్‌లో సభ్యులు గ్రామాల్లోని సమస్యలను ఏకరువు పెట్టారు. గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు బాగోలేదని, సమయపాలన పాటించడం లేదని, వారిపై అధికారుల పర్యవేక్షణ అవసరం ఉందన్నారు. మండల సర్వ సమావేశాల్లో లేవనెత్తిన ఒక సమస్య కూడ పరిష్కారానికి నోచుకోలేదని, ఇంకేందుకు మండల మీట్ అని అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. మూడు నెలలకోసారి జరిగే మండల మీట్‌లో ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను అధికారుల పరిష్కరించుకోవాలన్నారు. పార్టీలు, కులాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందేలా అధికారులు చూడాలని తెలిపారు. విద్య, ఆరోగ్యం ,విద్యుత్, వ్యవసాయం, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. వ్యవసాయశాఖ అధికారి భారతి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులను అందజేస్తున్నామని తెలిపారు. కాటూరు గ్రామ దళితవాడలో శ్మశానం లేక పోవడంతో చెరువు కట్టపై శవాలను పూడ్చుతున్నామని, శ్మశానికి స్థలం కేటాయించాలని పలు సమావేశాల్లో ఫిర్యాదు చేసిన పట్టించుకున్న పాపాన పోలేదని ఎమ్పీటీసీ సభ్యుడు రవి అన్నారు. ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, హౌసింగ్ ఏఈ గోపి, ట్రాన్స్‌కో ఏఈ చలపతి, పీఆర్ ఏఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్య, ఉపాధి ఏపీఓ దేవరి, ఎస్ఐ విశ్వనాథనాయుడు, డీటీ చంద్రబాబునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో మాధవమాల

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం మాధవమాల దళితవాడలో అంధకారం అలుముకుంది. గురువారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికులు పలు మార్లు ఫోన్లు చేసినా విద్యుత్ శాఖ సిబ్బంది సమాధానం చెప్పకపోవడంతో రాత్రి వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో గ్రామంలో చిమ్మచీకటి అలుముకుంది. తరచూ అనధికారిక విద్యుత్ కోతలు విధిస్తూ ప్రజలను నరకయాతనకు గురి చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా చెన్నకేశవుడి పల్లకీసేవ

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో జరుగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి చెన్నకేశ్వర స్వామి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి ఊరేగించారు.

తప్పుడు రిపోర్టులు ఇచ్చే వారిపై చర్యలు తీసుకోవాలి

వరదయ్యపాళెం: కల్కి వివాదాస్పద భూములకు సంబంధించి విచారణకు వచ్చిన రెవెన్యూ, అటవీశాఖ అధికారులు, ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు అందజేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీఎన్‌కండ్రిగ మండలం కల్లివెట్టు గ్రామ రెవెన్యూ లెక్కల దాఖలల్లోని సర్వే నంబర్ 295లోని అటవీ భూములను కల్కి ట్రస్టు ఆక్రమించుకుని, పబ్బం గడుపుతున్నారని తెలిపారు.

నైట్ విజన్ డ్రోన్ నిఘా



రైల్వేట్రాక్ పక్కన ఉన్న మద్యం సీసాలను పరిశీలిస్తున్న పోలీసులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట రైల్వేస్టేషన్ పరిసరాల్లో చోరీలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలన్న ఉద్దేశంతో నైట్ విజన్ డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేసినట్లు జీఆర్పీ పీఎస్ఐ రవికుమార్ తెలిపారు. గురువారం రాత్రి రేణిగుంట రైల్వేస్టేషన్ పరిసర రైల్వేట్రాక్‌లో డ్రోన్ కెమెరాతో నిఘా ఉంచి పోలీసులు గస్తీ నిర్వహించారు. తిరుపతి రైల్వే డీఎస్పీ హర్షిత ఆదేశాలు మేరకు జీఆర్పీ సీఐ యతేంద్ర, ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.

వాహనాల తనిఖీ

నాగలాపురం: స్థానిక బైపాస్ రోడ్డు సమీపంలో గురువారం సాయంత్రం ఎస్ఐ సునీల్ వాహనాలు తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సునీల్ మాట్లాడుతూ వాహనచోదకులు వాహనాలకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు.